సాక్షి
విశాఖపట్నం
గురువారం । 21 । మార్చి । 2024

వైఎస్సార్ సీపీ పరిశీలకుల నియామకం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు **పరిశీలకులను నియమించారు.** 8లో



ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం

ఓటు నమోదు నుంచి నామినేషన్లు, ప్రచారాలు, పోలింగ్, కౌంటింగ్ వరకు అధికార యంత్రాంగం కీలకంగా వ్యవహరించనుంది. 8లో

కూల్ కూల్



ఉదయమే మొదలైన వాన రాత్రి వరకు ఉమ్మడి విశాఖలో కొన్ని చోట్ల మోస్తరు, అక్కడక్కడా భారీగాను కురిసింది. దీనికి చల్లని గాలులు కూడా తోడై వాతావరణాన్ని కూల్ చేసింది. 8లో

నేను.. నా ఇల్లు



జగనన్న కాలనీ ఆర్చ్

సొంతింటి కల నెరవేర్చిన ప్రభుత్వం

- పేదలందరికీ ఇళ్లు పథకంతో మురిసిన జనం
- టీడీపీ హయాంలో ఒక్క ఇల్లూ ఇవ్వని చంద్రబాబు
- హుద్‌హుద్ ఇళ్ల పేరుతో పచ్చ నేతల దోపిడీ పర్వం



ఆహ్లాదకర వాతావరణంలో జగనన్న కాలనీ ఇళ్లు



ఆనందపురం మండలం లొడగలవానిపాలెంలో జగనన్న కాలనీ ఇళ్లు

జిల్లాలో జగనన్న ఇళ్ల నిర్మాణ వివరాలు

నియోజకవర్గం/ మండలం	లేఅవుట్స్	కేటాయించిన ఇళ్లు	పూర్తి చేసినవి	ప్రభుత్వ వ్యయం (రూ.కోట్లలో)
పెందుర్తి	14	2031	843	20.48
భీమిలి	44	2319	849	22.60
ఆనందపురం	56	2596	1072	27.17
పద్మనాభం	24	2411	894	23.37
రూరల్‌లో మొత్తం	138	9357	3658	93.63
జీవీఎంసీ స్థలాల్లో	00	6794	6044	135.56
జీవీఎంసీ లేఅవుట్స్	59	1,14,805	5941	561.44
మొత్తం	197	1,30,956	15643	790.63

‘పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడం అంటే.. కేవలం వారు తలదాచుకోడానికి గూడు కల్పించడమే కాదు.. సమాజంలో సగౌరవంగా తలెత్తుకొని బతికేలా ఆత్మవిశ్వాసాన్ని కల్పించడమే. అందుకే.. సొంత ఇల్లు పేదల ఆత్మ గౌరవానికి సూచిక. మన అక్కచెల్లెమ్మలకు ఒక అన్నగా ఇస్తున్న కానుకే ఈ జగనన్న ఇల్లు’

ఇదీ.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బడుగుల ఆత్మ గౌరవానికి సౌధాలుగా చెప్పుకునే ఇంటి గురించి చెప్పిన మాటలు.

‘ఒక సెంటు భూమిలో ఇల్లు కట్టిస్తామని జగన్ చెబుతున్నాడు. ఆ సెంటు భూమి బరియల్ గ్రౌండ్‌కి మాత్రమే ఉపయోగపడుతుంది. ఎవరైనా చనిపోతే అందులో పూడ్చడానికి మాత్రమే ఈ సెంటు భూమిని ఉపయోగించవచ్చు’

ఇవీ.. 40 ఏళ్ల సీనియర్ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు పేదల సౌధాలపై చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలు.

నిజమే సెంటు స్థలంలో ఇల్లు చిన్నదే. కానీ.. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా వెలగబెట్టిన చంద్రబాబు.. ఎన్ని సెంట్ల స్థలాల్లో నిరుపేదలకు ఇళ్లు కట్టారో ఆయనకే ఎరుక.

సాక్షి, విశాఖపట్నం : సొంత ఇల్లు... పేదల ఆత్మగౌరవ సూచిక. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఇంటి స్థలం కాగితం చేతికివ్వడం అంటే ఆత్మగౌరవ పతాకాన్ని వారి చేతికిచ్చినట్లే. ఎందరో అభాగ్యుల దుర్భర జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు’ పథకం వెలుగులు నింపుతోంది. ప్రభుత్వం విశాఖ జిల్లాలో 1,30,956 మంది మహిళల పేరిట ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మింపజేస్తోంది. ఇదంతా ఉచితమే. పేదల మీద భారం లేకుండా సొంత ఇంటి కలను నిజం చేసే బాధ్యతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారు. ఒక్క రూపాయి ఖర్చులేకుండా ప్రభుత్వం వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది.

197 లేఅవుట్లలో నిర్మాణాలు

విశాఖ జిల్లాలో మొత్తం 197 లేఅవుట్లలో జగనన్న ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇందులో రూరల్ మండలాల పరిధిలో ఉన్న ప్రజల కోసం 138 లేఅవుట్స్‌లో 9,357 ఇళ్లు నిర్మిస్తుండగా.. జీవీఎంసీ పరిధిలో ఉన్న ప్రజల కోసం 59 లేఅవుట్స్‌ను అభివృద్ధి చేసి 1,14,805 ఇళ్లు నిర్మిస్తున్నారు. ఇవి కాకుండా.. జీవీఎంసీ సొంత స్థలాల్లో 6,794 మందికి ఇళ్లు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం కల్పించే మౌలిక వసతుల వ్యయం కలిపితే ఇంటి స్థలం, ఇల్లు ఖరీదు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉంటుంది. ఈ కాలనీలు ఊర్లుగా రూపుదిద్దుకుంటున్నాయి.

సమగ్ర సౌకర్యాలతో...

ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయంతో పాటు డ్వాక్రా మహిళలకు రూ.35 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు అందిస్తోంది. నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. సిమెంట్, స్టీల్‌ను రాయితీపై ఇస్తోంది. ఐఎస్‌ఐ మార్కు ఉన్న నాణ్యమైన సిమెంట్, స్టీల్, ఇతర వస్తువులను మార్కెట్ ధరల కంటే తక్కువకే అందిస్తోంది. కేవలం ఇళ్లను నిర్మించి ఇవ్వడమే కాకుండా.. పూర్తిస్థాయి సౌకర్యాల్ని ప్రభుత్వం కల్పిస్తోంది. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా పైపులైన్లు, భూగర్భ డ్రెయినేజీ, అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు అన్ని కాలనీల్లో ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్నెట్ సదుపాయం కల్పించడానికీ భూగర్భ కేబుళ్లు వేస్తున్నారు.

విశాఖ జిల్లా పరిధిలో 1,30,956 మందికి ఇళ్లు

ఒక్క జీవీఎంసీ పరిధిలోనే 1,14,805 మందికి గృహయోగం

ఇళ్ల నిర్మాణానికి రూ.790.63 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం

ఇప్పటికే 15,643 మంది గృహ ప్రవేశాలు, తుది నిర్మాణ స్థాయిలో మరో 12 వేలు

పేదలకు ‘క్వాలిటీ లైఫ్’ అందించడానికి ప్రభుత్వం చేపట్టిన మహాయజ్ఞంలా నిర్మాణాలు సాగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 12 వేల ఇళ్లల్లో గృహ ప్రవేశాలు పూర్తికాగా.. మరో 12 వేల ఇళ్లు గృహప్రవేశాలకు ముస్తాబవుతున్నాయి.

బాబు హయాంలో బేల చూపులే...

14 సంవత్సరాల పాటు సీఎంగా ఉన్న చంద్రబాబు ఏనాడు పేదల గురించి ఆలోచించలేదు. అధికారంలో ఉన్నప్పుడు.. సీఎం స్థాయి నుంచి జన్మభూమి కమిటీ వరకూ దోచుకునేందుకు ఎక్కడ దారి దొరుకుతుందో చూడటమే తప్ప.. పేద ప్రజలకు ఒక గూడు ఇద్దామన్న ఆలోచనే వారికి కనిపించలేదు. 2014లో హుద్‌హుద్ ధాటికి వేల మంది ప్రజలు ఇళ్లు కోల్పోయారు. వారికి కొత్తగా ఇళ్లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో హుద్‌హుద్ ఇళ్లను విశాఖలో నిర్మించారు. జిల్లాలో 30 ప్రాంతాల్లో 5,468 ఇళ్లను నిర్మించాలని నిర్ణయించినా కనీసం 3 వేలు కూడా పూర్తి చేయలేకపోయారు. 2016 ఏప్రిల్ నాటికి బాధితులకు ఇళ్లు అప్పగిస్తామని చెప్పారు. 2019 ఎన్నికలు వచ్చేంత వరకూ కూడా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయలేకపోయారు. బాధితుల జాబితా అధికారుల వద్ద ఉన్నా.. దానితో సంబంధం లేకుండా టీడీపీ జన్మభూమి కమిటీలే అర్హుల జాబితాని సిద్ధం చేశాయి. ఇళ్ల కేటాయింపులో 80 శాతం వరకూ టీడీపీ కార్యకర్తలకు మొదటి ప్రాధాన్యమిచ్చారు. ఇతర పార్టీల వారు బాధితుల జాబితాలో ఉన్నా.. వారిని పక్కకు తప్పించారు. ఇలా ఒక్క ఇంటిని కూడా నిరుపేదకు ఇవ్వని చరిత్ర తెలుగుదేశం పార్టీది.

దరఖాస్తు చేసిన వెంటనే మంజూరైంది



ఇంటి పట్టాతో ఎర్ర మహాలక్ష్మి

నా పేరు ఎర్ర మహాలక్ష్మి. మాది ఆనందపురం మండలం కణమాం పంచాయతీ గొల్లల కణమాం. మాది ఉమ్మడి కుటుంబం. నా భర్త రాజు, ఇద్దరు పిల్లలం, మా బావ రాముతో పాటు ముగ్గురు, అత్త మామలందరం కలిపి ఒకే ఇంట్లో 10 మంది నివసించే వాళ్లం. అందరం ఒకే సారి ఇంట్లో కూర్చొని భోజనం చేయడానికి కూడా అవకాశం ఉండేది కాదు. ఈ ఇబ్బందులు పడలేక కాలనీ ఇల్లు కోసం టీడీపీ ప్రభుత్వ హయాంలో పలు మార్లు దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని ప్రస్తుతం మా కుటుంబ సభ్యులం నివసిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

జగనన్న కాలనీలో హాయిగా జీవిస్తున్నాం



సొంత ఇంటి వద్ద ముంజేటి లక్ష్మి

నా పేరు ముంజేటి లక్ష్మి. ఆనందపురం మండలం, శొంఠ్యాంలో కుటుంబంతో కలసి నివసిస్తున్నాను. 30 ఏళ్ల కిందట నా భర్త సూరిబాబు, నలుగురు పిల్లలతో ఉపాధి కోసం ఇక్కడకు వలస వచ్చాం. అప్పటి నుంచి అద్దె ఇంట్లో ఉంటూ కాలం వెళ్లదీస్తున్నాం. బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న హోటల్ నడుపుకుంటున్నాం. అద్దె ఇంట్లో ఉంటూ అష్టకష్టాలు పడుతున్న సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలనీ ఇల్లు మంజూరు చేశారు. దీంతో ఇంటిని సకాలంలో పూర్తి చేసుకుని ప్రస్తుతం ఇందులో హాయిగా జీవిస్తున్నాం. ఎన్నో ఏళ్ల కల ఈ ప్రభుత్వ హయాంలోనే నెరవేరింది. కాలనీలో అన్ని సౌకర్యాలు కల్పించారు.

సంతోషంగా ఉంది



ఇంటి పట్టాతో తోకాడ బాలగణపతి

నా పేరు తోకాడ బాలగణపతి. ఆనందపురం మండలం, కణమాం పంచాయతీ, గొల్లల కణమాంలో నివాసం ఉంటున్నాం. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలనీ ఇల్లు కోసం దరఖాస్తు చేసినా.. మంజూరు కాలేదు. మేము నలుగురు కుటుంబ సభ్యులతో పాటు అత్త మామలు, మా మరిది కుటుంబంతో సహా పాత ఇంట్లో తలదాచుకునేవాళ్లం. పేద కుటుంబం కావడం, సొంత స్థలం కూడా లేకపోవడంతో ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మా కష్టాలు తీరాయి. వలంటీరు ద్వారా దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం కాలనీ ఇల్లు మంజూరు చేసి ఆదుకుంది. దీంతో మా కుటుంబం కొత్త ఇంట్లోకి గృహ ప్రవేశం చేసి ఇక్కడే నివసిస్తున్నాం. ఇంటి సమస్య తీరడంతో ఎంతో సంతోషంగా ఉంది.

అప్పట్లో 15 సార్లు దరఖాస్తు చేసుకున్నా..



నా పేరు వాసుపల్లి కనకమహాలక్ష్మి, మాది మంగమారిపేట, నా భర్త వాసుపల్లి దనరాజు ఆటో నడుపుతూ మా కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా పెళ్లై పదేళ్లు అవుతోంది. మాకు ఇద్దరు పిల్లలు. మా పెళ్లైన కొత్తలో అప్పటి ప్రభుత్వంలో సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఏవో కారణాలు చెప్పి ఇల్లు రాకుండా చేశారు. అప్పట్లో దాదాపు 15 సార్లు ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్నా తిరస్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వలంటీర్ స్వయంగా మా ఇంటికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి కోసం దరఖాస్తు తీసుకున్నారు. 30 రోజుల్లో కాపులుప్పాడ ప్రాంతంలో స్థలాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఇసుక, సిమెంట్, స్టీల్ ఉచితంగానే అందజేసింది. ఆరు నెలల్లో సొంతింటిని నిర్మించుకున్నాం. సీఎం జగన్ వల్ల మాకు సమాజంలో గౌరవం పెరగడంతో పాటు మాకంటూ ఓ గూడు దొరికింది. ఇప్పుడు నేను సొంతింటిలో కుటుంబంతో సంతోషంగా జీవిస్తున్నా.

కలే అనుకున్న ఇల్లు నిజమైంది



నా పేరు తోనంగి సౌజన్య. నా పుట్టిల్లు పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీ ఇప్పిలివానిపాలెం. దిగువ మధ్యతరగతి కుటుంబం. ఉన్నంతలో మా అమ్మ బలిరెడ్డి నాగమణి నాకు పెళ్లి చేసింది. అదే సమయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నవరత్నాలు–అందరికీ ఇళ్లు పథకంలో ఇంటి స్థలం ఇచ్చింది. నాకు పెళ్లి చేసిన సమయంలో ఆ స్థలాన్ని నాకు పసుపు–కుంకుమ కింద మా అమ్మ ఇచ్చింది. ప్రభుత్వ సాయంతో సొంత ఇంటిని నిర్మించుకున్నాం. 2020 జూన్‌లో గృహ ప్రవేశం చేశాం. మాకు సొంతిల్లు కలే అనుకున్న సమయంలో జగనన్న చేసిన సహాయం జీవితంలో మరిచిపోలేం. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం.

కల నెరవేరింది



నా పేరు కె.వి.జి.ఎస్.ఎన్.మహేశ్వరరావు. అగనంపూడి కాలనీ. దొరికిన చోట పనిచేసుకుంటూ.. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఓ ఇంటికి యజమానిని చేశారు. సొంతింటికి స్థలం మంజూరు చేయడంతో పాటు నిర్మాణానికి ఆర్థిక సాయం చేశారు. ఇంటి స్థలం కేటాయించమని గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలతోపాటు ప్రతీ జన్మభూమి సమావేశంలో అర్జీలు పెట్టుకున్నాం. ప్రతీ సారి దరఖాస్తు చేయడం, ఆ దరఖాస్తు చెత్తబుట్టలోకి వెళ్లేది తప్పా ప్రయోజనం కనిపించలేదు. అదే ఈ ప్రభుత్వంలో వలంటీర్లే మా ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. దగ్గరుండి మరీ పెదముషిడివాడ లేఅవుట్‌లో స్థలాన్ని అప్పగించారు. ఇంటికే వచ్చి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. ఇంత మేలు చేసిన ప్రభుత్వానికి మా కుటుంబం మొత్తం రుణపడి ఉంది.

7 వేల కటౌట్స్, జెండాలు, హోర్డింగులు తొలగించాం..

- ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలి
- రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చిన జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున, సీపీ రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం : స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా రాజకీయ పక్షాలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, నామినేషన్లు, ప్రచారం, పోలింగ్, కౌంటింగ్ తదితర ఎన్నికల ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో విస్తృత అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే జిల్లాలోని వివిధ రాజకీయ పక్షాలకు చెందిన విగ్రహాలకు ముసుగులు వేశామని, 7 వేల వరకు కటౌట్లు, జెండాలు, హోర్డింగులను తొలగించామన్నారు. జూన్ 6వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రాంగణాల్లోని వాణిజ్య స్థలాల్లో ఎలాంటి రాజకీయ ప్రకటనలు, హోర్డింగులు, పోస్టర్లు, బ్యానర్లను అనుమతించబోమన్నారు. కొత్త ప్రదేశాల్లో హోర్డింగులు పెట్టుకునేందుకు అనుమతులు ఇవ్వమని స్పష్టం చేశారు. ఆర్వో అనుమతి లేకుండా బైక్ ర్యాలీ, ఇతర ర్యాలీలను నిర్వహించరాదని తెలిపారు. సి–విజిల్ యాప్‌లో ఇప్పటివరకు 12 ఫిర్యాదులు అందాయని, ఆ వివరాలు ఎన్నికల కమిషన్‌కు తెలియజేసినట్లు కలెక్టర్ వివరించారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. ఇకపై రాజకీయ పక్షాలు హోర్డింగులు, జెండాల కోసం రిటర్నింగ్ అధికారి ముందస్తు అనుమతి తప్పనిసరని, కరపత్రాలు, గోడపత్రికలపై ఆర్వో అనుమతితో పాటు ప్రచురించిన ముద్రణ సంస్థ పేరు తప్పనిసరిగా ఉండాలని తేల్చిచెప్పారు. 10 వాహనాలను ఒక యూనిట్‌గా వినియోగించుకోవాలని, పది వాహనాలకు పైగా దాటితే 100 అడుగులు దూరం పాటించాలని స్పష్టం చేశారు. వాహనాలు ఎవరి పేరున తీసుకున్నారో, వారు మాత్రమే వినియోగించుకోవాలని, వేరే వ్యక్తులు వినియోగించినట్లయితే కోడ్ ఉల్లంఘన కింద వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా సమావేశాలు, లౌడ్ స్పీకర్లను వినియోగించరాదన్నారు. ఓటర్ల స్లిప్పులను బీఎల్‌వోలు పంపిణీ చేస్తారని, పార్టీల ప్రతినిధులు చేయాల్సి వస్తే తెల్ల కాగితంపై ఉన్న ఓటరు స్లిప్పులనే వినియోగించాలే తప్ప, ఇతర రంగులు వినియోగించరాదని, అలా చేస్తే కోడ్ ఉల్లంఘన కింద పరిగణిస్తామని కమిషనర్ హెచ్చరించారు.

ప్రతి అనుమతి సువిధ యాప్‌లోనే..

పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ ఏ అనుమతి కావాలన్నా సువిధ యాప్ ఉందని, ఇందులో నమోదు చేయలేని వారు రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతి పొందవచ్చన్నారు. సమావేశాలు నిర్వహించే తేదీ, సమయం, ర్యాలీలో పాల్గొనే వ్యక్తుల సంఖ్య తదితర వివరాలు స్పష్టంగా ఉండాలని, అన్ని పార్టీల దరఖాస్తులను పరిశీలించిన తర్వాత అనుమతిని మంజూరు చేస్తామని తెలిపారు. రాజకీయ పక్షాల ప్రతి పనినీ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎం.సి.సి., తదితర బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయని తెలిపారు. రాజకీయ పక్షాలు ముందుగా నమోదు చేసిన రూటులో కాకుండా వేరే మార్గాన ర్యాలీలు నిర్వహిస్తే వాటిని కోడ్ ఉల్లంఘనగా గుర్తిస్తూ, పంచనామా చేసి ఎంపీడీవో నివేదిక ఇస్తారన్నారు. ఆధారాలు లేకుండా ఫిర్యాదులు చేస్తే అటువంటి వారిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముగ్గురు వ్యక్తులతో కూడిన గ్రీవెన్స్ కమిటీ జిల్లాలో ఉందని, ఎన్నికలకు సంబంధించిన ఎటువంటి ఫిర్యాదులనైనా చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు అడిగిన సందేహాల్ని అధికారులు నివృత్తి చేశారు. జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ కేఎస్ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంశీ..వద్దంతే..

- విశాఖ దక్షిణ జనసేనలో పెల్లుబికిన నిరసనలు
- వంశీకృష్ణను మేకతో పోల్చిన సాధిక్ వర్గీయులు
- అడ్డుకున్న వంశీకృష్ణ అనుచరులు
- ఇరువర్గాల మధ్య తోపులాట, చెదరగొట్టిన పోలీసులు



బాహాబాహీకి దిగిన వంశీకృష్ణ, కార్పొరేటర్ సాధిక్ వర్గీయులు



వంశీకృష్ణను మేకగా చూపిస్తూ.. నిరసన తెలుపుతున్న సాధిక్ వర్గీయులు

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీలో విభేదాలు మరింత ముదిరి పాకానపడ్డాయి. వంశీకృష్ణ శ్రీనివాస్, కార్పొరేటర్ సాధిక్ వర్గాల మధ్య పోరు తారస్థాయికి చేరుకుంది. విశాఖ దక్షిణ జనసేన టికెట్ వంశీకృష్ణకు ఇవ్వొద్దంటూ మూడు రోజులుగా నిరసన తెలుపుతున్న సాధిక్ వర్గీయులు.. తాజాగా బుధవారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. వీరిని వంశీకృష్ణ శ్రీనివాస్ వర్గీయులు అడ్డుకుని.. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. క్రమంగా ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి, ఇరువర్గాలను చెదరగొట్టారు.

వంశీకృష్ణతోనే ముసలం మొదలు

జనసేనలోకి వంశీకృష్ణ వచ్చిన తర్వాతే దక్షిణ జనసేనలో విభేదాలు మొదలయ్యాయని ఆ పార్టీ నాయకుడు ఆరోపించారు. ఆయన రౌడీలను తీసుకొచ్చి.. ప్రశాంతంగా ఉన్న పార్టీలో అలజడులకు కారణమయ్యారని మండిపడ్డారు. ఆయనకు లొంగలేని వారిని లొంగదీసుకునేందుకు రౌడీలు, గూండాలను తీసుకొచ్చి తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో జనసేన అభిమాని మాట్లాడుతూ తూర్పులో రౌడీయిజం చేయడం వల్లే వంశీకృష్ణ ఓడిపోయారని, ఆయన్ని ఇక్కడకు తీసుకు రావడంతో ఇక్కడ కూడా రౌడీయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఓ వీర మహిళ మాట్లాడుతూ తామంతా 39వ వార్డులో నివసిస్తున్నామని.. ఎక్కడి నుంచో వచ్చిన వంశీ దాడులు ప్రేరేపిస్తున్నారన్నారు. స్థానికులకే టికెట్ కేటాయించాలంటూ తామంతా నిరసన తెలుపుతుంటే వంశీ వర్గీయులే తమపై అసభ్యంగా ప్రవర్తించారని మరో వీరమహిళ ఆవేదన వ్యక్తం చేశారు. వీరమహిళలపై అసభ్యంగా వ్యవహరించడమే గాక చున్నీలు లాగడం, చేతులు వేయడం వంటివి దిగజారుడు చేష్టలకు పాల్పడ్డారని.. ఇది ఎంతవరకు సమంజసమో వంశీకృష్ణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రంజాన్ మాసంలో ఇలా చేయొచ్చా.?

రంజాన్ మాసంలో మహిళల పట్ల ఇలా ప్రవర్తించడం సమంజసం కాదని.. గరికిన రవి, శివప్రసాద్ తమ పట్ల నీచంగా ప్రవర్తించారని ఓ ముస్లిం మహిళ మండిపడ్డారు. మహిళ అని చూడకుండా అసభ్యంగా వ్యవహరించారని.. మహిళలపై ఇలా దాడులు చేయడం వంశీకి న్యాయమా? అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

వంశీకృష్ణ, అనుచరులపై చర్యలు తీసుకోవాలి

సాధిక్ 39వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యాలయంపై కొంత మంది దాడి చేశారు. ఈ దాడిని ముస్లిం మైనార్టీలు తీవ్రంగా ఖండించారు. ఈ దాడిని రాష్ట్ర మైనార్టీ కమిషన్, జాతీయ మైనార్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వంశీకృష్ణ శ్రీనివాస్, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

విశాఖ దక్షిణకు బలిపశువునా?

విశాఖ దక్షిణలో జనసేన గెలవాలంటే గెలుపు గుర్రం కావాలని.. అలాంటిది ఓ బలిపశువును తీసుకొచ్చి మాపైకి వదులుతారా అంటూ సాధిక్ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మేకపోతుకు వంశీకృష్ణ శ్రీనివాస్ చిత్రపటాన్ని పెట్టి.. ఈ బలిపశువు మాకొద్దంటూ తేల్చి చెప్పారు. దీంతో వంశీ వర్గీయులు వీరిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సాధిక్ వర్గీయుడు సూరాడ తాతారావు మాట్లాడుతూ పార్టీకి ఎప్పటి నుంచే సేవలందిస్తున్నామని.. ఓ బలి పశువును తీసుకొచ్చి టికెట్ కేటాయిస్తే ఎలా సహకరిస్తామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల ప్రక్రియలో వీరే కీలకం

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి
- పార్లమెంట్ నియోజకవర్గానికి ఆర్వోగా కలెక్టర్
- జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ ప్రతి అంశం పర్యవేక్షణ
- ఎన్నికల ప్రక్రియలో బీఎల్వో, ప్రిసైడింగ్ అధికారులూ ముఖ్యమే..



సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి నేపథ్యంలో కీలక సమరానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ అత్యంత కీలకమైన ప్రక్రియ. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ఉపయోగించి ప్రజలు తమకు నచ్చిన నేతను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకుంటారు. స్వేచ్ఛ, శాంతియుత వాతావరణంలో పౌరుడు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయడం పరిపాలనలో ముఖ్య బాధ్యత. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పకడ్బందీగా నిర్వహించేలా అవసరమైన అధికార యంత్రాంగాన్ని నియమించి.. వారికి తర్ఫీదునిస్తూ.. కొన్ని నెలల కిందట నుంచే సన్నద్ధం చేస్తారు. ఓటరు నమోదు నుంచి అభ్యర్థుల నామినేషన్లు, ప్రచారాలు, పోలింగ్, కౌంటింగ్ వరకు అన్ని ఘట్టాల్లో అధికార యంత్రాంగం కీలకంగా వ్యవహరిస్తుంది. బూత్ లెవల్ అధికారి నుంచి.. రిటర్నింగ్ అధికారి వరకు ప్రతి ఒక్కరిదీ ఈ క్రతువులో కీలక భూమికే.

జిల్లాలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ రిటర్నింగ్ అధికారిని ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గానికి ఓ రిటర్నింగ్ అధికారిని నియమించారు. మొత్తం జిల్లాలో జరిగే ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ వ్యవహరిస్తారు. ప్రస్తుత కలెక్టర్ మల్లికార్జున జిల్లా ఎన్నికల అధికారిగా, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఆర్వోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిల్లా పరిధిలో ఎన్నికల ప్రక్రియకు ఆయనే పూర్తి బాధ్యత వహిస్తారు. కింది స్థాయి అధికారులు, సిబ్బందికి విధుల కేటాయింపు, శిక్షణ కార్యక్రమాలు ఇలా అన్నీ కలెక్టరే పర్యవేక్షిస్తారు. బూత్ స్థాయి అధికారి(బీఎల్వో) నుంచి జిల్లా ఎన్నికల అధికారి వరకు ప్రతి ఒక్కరూ సమర్థంగా పని చేస్తేనే ఎన్నికల ప్రక్రియ విజయవంతమవుతుంది. రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల కమిషన్ అందజేసిన 'హ్యాండ్‌బుక్' ఆధారంగా నడుచుకుంటారు. నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతీ విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిందే.

రిటర్నింగ్ అధికారి

ఎన్నికల ప్రక్రియలో రిటర్నింగ్ అధికారి(ఆర్వో) పేరు తరచూ వినబడుతుంది. ప్రతీ నియోజకవర్గానికి ఓ రిటర్నింగ్ అధికారిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఫలితాలు ప్రకటించే వరకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థుల ఖర్చు, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, తిరస్కరణ, ఉపసంహరణ, పోటీలోని అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ, బ్యాలెట్ పేపర్ల తయారీ, కౌంటింగ్ వంటి కీలకమైన బాధ్యతలు రిటర్నింగ్ అధికారుల సమక్షంలోనే జరుగుతుంది. సహాయ రిటర్నింగ్ అధికారి సహకారంతో నియోజకవర్గ ఎన్నికల ప్రక్రియకు వీరే పూర్తి బాధ్యత వహిస్తారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గానికి ఒకటి లేదా రెండు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఉంటాయి. ఆ బృందాలు ఆయా మండలాల్లో మద్యం, డబ్బు, ఓటర్లను ప్రలోభ పరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా విస్తృతంగా తనిఖీలు చేపడతారు.

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు

విస్తృతమైన ఎన్నికల ప్రక్రియలో అన్ని పనులను ఆర్వో ఒక్కరే చూసుకోలేరు. అందుకే ఆయనకు సహాయం చేయడానికి ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఎన్నికల సంఘం నియమిస్తుంది. ప్రతీ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి.. రిటర్నింగ్ అధికారి నియంత్రణకు లోబడి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రిటర్నింగ్ అధికారి విధులను నిర్వర్తించినప్పుడు.. అతను 'అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్'అని సంతకం చేయాల్సి ఉంటుంది.

సెక్టోరియల్ అధికారి

పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారి పైనే ఉంటుంది. ఆరు పోలింగ్ కేంద్రాలకు ఓ సెక్టోరియల్ అధికారిని నియమిస్తారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంపులు, ఇతర వసతుల కల్పించడం వీరి విధుల్లో భాగం. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అధికారం సెక్టోరియల్ అధికారికి ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల్లో చేపట్టాల్సిన బందోబస్తును సిఫారసు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.

బూత్ స్థాయి అధికారి(బీఎల్వో)

ఎన్నికల ప్రక్రియలో చిట్టచివరి సిబ్బందే బూత్ స్థాయి అధికారి. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు దరఖాస్తులు వీరే పర్యవేక్షిస్తారు. అర్హులైన పౌరుల పేర్లు ఓటరు జాబితాలో ఉండేలా విధులు నిర్వర్తిస్తారు. ఓటరు నమోదు, జాబితా తయారీలోపై అధికారులకు తోడ్పాటునందిస్తారు.

ప్రిసైడింగ్ అధికారులు

జిల్లా ఎన్నికల అధికారి ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ప్రిసైడింగ్ అధికారిని నియమిస్తారు. పోలింగ్ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడడం పోలింగ్ స్టేషన్‌లో ప్రిసైడింగ్ అధికారి ముఖ్య విధి.

మైక్రో అబ్జర్వర్లు..

ఎన్నికలు జరిగే తీరును నివేదికగా రూపొందించి జిల్లా, రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు.

ఎన్నికల పరిశీలకులు

ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు ప్రభుత్వంతో సంప్రదించి తగిన సంఖ్యలో ప్రభుత్వ ఉన్నతాధికారులను ఎన్నికల పరిశీలకులుగా నియమిస్తారు. ఎన్నికల పరిశీలకులు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కమిషనర్‌కు సహాయం చేస్తారు. కమిషన్ అప్పగించిన ఇతర విధులను సైతం ఎన్నికల పరిశీలకులు నిర్వర్తిస్తారు.

ఒకరి బదులు పరీక్ష రాసిన వ్యక్తిపై ఫిర్యాదు

ఆరిలోవ: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం 10వ తరగతి పరీక్షల్లో ఒకరి బదులు పరీక్ష రాసిన వ్యక్తిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు అందింది. తోటగరువు ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన 10వ తరగతి పరీక్షలో ఓ వ్యక్తి పరీక్షను మరో వ్యక్తి రాశాడు. పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన స్క్వాడ్ బృందం అతన్ని గుర్తించింది. పరీక్ష రాయాల్సిన వ్యక్తిని.. మిగిలిన పరీక్షలు రాయడానికి వీలులేకుండా డిబార్ చేశారు.

అబ్బాయిలతో కలిసి ఉంటేనే వైద్య విద్య

- కజకిస్తాన్‌లో విశాఖ యువతికి వేధింపులు
- భారత్‌కు వెళ్లిపోతానన్నా పాస్‌పోర్ట్ ఇవ్వకుండా ముప్పుతిప్పలు
- ఫీజు మొత్తం చెల్లిస్తేనే పంపిస్తామంటూ కన్సల్టెన్సీ బెదిరింపులు
- గాజువాక పోలీసులను ఆశ్రయించిన విద్యార్థిని తండ్రి



విద్యార్థిని జి.భవాని

విశాఖ సిటీ: వైద్యురాలుగా స్థిరపడాలనుకుంది. విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేయాలని భావించింది. ఎంత ఖర్చయినా తన కుమార్తెను డాక్టర్‌గా చూడాలని తల్లిదండ్రులు తాపత్రయపడ్డారు. నగరానికి చెందిన కన్సల్టెన్సీ ద్వారా కజకిస్తాన్‌లో ఒక యూనివర్సిటీలో సీటు సంపాదించారు. కోటి ఆశలతో విదేశీ యూనివర్సిటీలోకి అడుగుపెట్టిన కొద్ది రోజులకే విద్యార్థినికి వేధింపులు ప్రారంభమయ్యాయి. అక్కడ హాస్టల్‌లో అబ్బాయిలతో కలిపి వసతి కల్పించడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. పాశ్చాత్య పోకడలకు ఇమడలేని విద్యార్థిని ఇంటికి వెళ్లిపోతానని వేడుకున్నప్పటికీ.. పాస్‌పోర్ట్ తీసుకొని మొత్తం ఫీజు చెల్లిస్తేనే పంపిస్తామంటూ బెదిరింపులు మొదలయ్యాయి. దీంతో విద్యార్థిని తన పరిస్థితిని తల్లిదండ్రులకు చెప్పుకొని



కాస్పియన్ యూనివర్సిటీ

దేశం కాని దేశంలో తిండీ, నిద్ర లేకుండా ఇబ్బందులు పడుతోంది. అక్కడి పరిస్థితులను, ఆమె బాధను వివరిస్తూ సెల్ఫీ వీడియో సైతం విడుదల చేసింది. దీనిపై ఆమె తల్లిదండ్రులు గాజువాక పోలీసులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే.. మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన జి.భవాని విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేయాలని భావించింది. ఇందుకోసం గాజువాకలో ఉన్న జీవీకే కన్సల్టెన్సీ అనే సంస్థను సంప్రదించారు. దాని ద్వారా కజకిస్తాన్ దేశంలో అల్మటీ నగరంలో కాస్పియన్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటుకు డబ్బు చెల్లించారు. ఆ సమయంలోనే అక్కడి వసతి ఏర్పాట్లపై భవాని తండ్రి జగదీష్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో స్పష్టంగా మాట్లాడారు. గర్ల్స్, బాయ్స్‌కు ప్రత్యేక హాస్టళ్లు ఉంటాయని చెప్పడంతో వారు సీటు కోసం డబ్బు చెల్లించారు. భవాని ఈ నెల 11వ తేదీన కజకిస్తాన్‌కు వెళ్లింది. యూనివర్సిటీలో ఒక భవనంలోనే అబ్బాయిలకు, అమ్మాయిలకు వసతి కల్పించారు. కొద్ది రోజులపాటు సర్దుకున్న భవాని అక్కడి వాతావరణాన్ని జీర్ణించుకోలేకపోయింది. అబ్బాయిలతో కలిసి ఉండడం, వారు సిగరెట్, ఇతర అలవాట్లను చూసి భరించలేక ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పింది. దీనిపై జగదీష్ కన్సల్టెన్సీ ప్రతినిధులను సంప్రదించారు. తన కుమార్తెను వేరే హాస్టల్‌కు మార్చాలని కోరాడు. చెప్పిన కొద్దిసేపటికే భవాని రూమ్‌కు కొంత మంది సీనియర్ అబ్బాయిలు వెళ్లి ఎంబీబీఎస్ పూర్తి చేయాలంటే తప్పనిసరిగా తమతో కలిసే ఉండాలని హెచ్చరించారు. అబ్బాయిలకు, అమ్మాయిలకు వేర్వేరుగా వసతి కల్పించినట్లు చెప్పాలని బలవంతం పెట్టడంతో భయపడిన భవాని మళ్లీ తన తండ్రికి ఫోన్ చేసి వేరే హాస్టల్‌కు మార్పించినట్లు చెప్పింది.

డబ్బు చెల్లిస్తేనే పాస్‌పోర్ట్ ఇస్తామంటూ..

అక్కడి వాతావరణాన్ని భరించలేని భవాని తాను అక్కడ ఉండలేనని, ఇంటికి పంపించేయాలని కళాశాల వాళ్లను వేడుకుంది. ఫీజు మొత్తం డబ్బు చెల్లిస్తేనే తిరిగి పంపిస్తామంటూ ఆమె పాస్‌పోర్ట్ ఇవ్వకుండా వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. దీంతో ఆమె ఈ విషయాన్ని తండ్రి జగదీష్‌కు చెప్పింది. హాస్టల్‌లో పరిస్థితులు బాగోలేవని, తాను ఇంటికి వెళ్లేందుకు సహాయం చేయాలని అధికారులను కోరుతూ సెల్ఫీ వీడియో తీసి పంపించింది. దీనిపై తండ్రి జగదీష్ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమార్తెకు తిరిగి విశాఖకు రప్పించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నాడు.

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ పరిశీలకుల నియామకం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించారు. గాజువాక నియోజకవర్గం పరిశీలకులుగా ఐ.హెచ్.ఫరూఖీ, విశాఖ దక్షిణ నియోజకవర్గం పరిశీలకులుగా ద్రోణంరాజు శ్రీవాత్సవ్, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకులుగా చొక్కాకుల వెంకట్రావ్, బాణాల శ్రీనివాసరావు, విశాఖ పశ్చిమ నియోజకవర్గం పరిశీలకులుగా ఎస్.ఎ.రెహ్మాన్, పీలా ఉమారాణి, పేడాడ రమణకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

రైలులో మతిస్థిమితం లేని గర్భిణి ప్రసవం

డెలివరీ చేసిన 108 సిబ్బంది



బిడ్డతో టెక్నీషియన్ శైలజ

మహారాణిపేట: విశాఖపట్నం స్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో మతిస్థిమితం లేని ఓ గర్భిణికి 108 సిబ్బంది ప్రసవం చేశారు. రాయగడ నుంచి విశాఖ వచ్చిన ఈ రైలులో ఆమె పురిటినొప్పులతో బాధపడుతోంది. ఆ సమయం రైలులో ఎవరూ లేరు. రైల్వే పోలీసులు గమనించి వెంటనే 108 సమాచారం ఇచ్చారు. దగ్గరలో ఉన్న కంచరపాలెం 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆమెకు ప్రసవం చేసి.. తల్లీ బిడ్డను కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నట్టు 108 టెక్నీషియన్ శైలజ, పైలట్ అప్పారావు తెలిపారు. సిబ్బందిని 108 జిల్లా కో ఆర్డినేటర్ సురేష్, జిల్లా మేనేజర్ త్రినాథ్, రైల్వే పోలీసులు అభినందించారు.

అనంతుడి కల్యాణోత్సవాలకు అంకురార్పణ



సంత పాత స్థలం వద్ద పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ వరకు వారం రోజులు జరగనున్న అనంతుడి కల్యాణోత్సవాలకు బుధవారం రాత్రి మృత్యం గ్రహణంతో అంకురార్పణ జరిగింది. ముందుగా విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం మృత్యం గ్రహణం(పుట్ట బంగారం తేవడంతో)తో కల్యాణోత్సవాలకు వేద పండితులు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా కుంతీ మాధవ స్వామి ఆలయంలోని చక్రపెరుమాళ్లను పల్లకీలో సంత పాత స్థలం వద్దకు తీసుకువచ్చారు. ఇక్కడ చక్ర పెరుమాళ్లకు, మేదిని మాత(భూమాత)లకు విశేష పూజలు చేశారు. అక్కడ నుంచి పుట్ట బంగారాన్ని కుంతీ మాధవ స్వామి ఆలయంలోకి తీసుకువెళ్లి పాళికల్లో వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటు బోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో లక్కీ షాపింగ్‌మాల్ ప్రారంభం

సినీ తార అనసూయ భరద్వాజ్ సందడి



లక్కీ షాపింగ్ మాల్‌లో చీరలును ప్రదర్శిస్తున్న నటి అనసూయ భరద్వాజ్

పాయకరావుపేట: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్కీ షాపింగ్ మాల్ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు బి.వి.సత్యవతి, నటి అనసూయ భరద్వాజ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి హాజరైన అనసూయ భరద్వాజ్ ముందుగా షాపింగ్ మాల్ బయట ఏర్పాటు చేసిన స్టేజిపై నుంచి ప్రేక్షకులకు అభివాదం చేశారు. షాపింగ్ మాల్ ప్రధాన ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేశారు. క్యాష్ కౌంటర్ వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అంతకుముందు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సత్యవతి లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభ సూచనగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ పాయకరావుపేటలో ఇంత పెద్ద షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఆమె షాపింగ్ మాల్ అంతా తిరిగి చీరలను పరిశీలించారు. షాపింగ్ మాల్ అధినేతలు సీరం రత్తయ్య, గ్రంధి శ్రీనివాసరావు, గ్రంధి సుబ్రమణ్యం (స్వామి)మాట్లాడుతూ తమ షోరూమ్ విస్తారమైన రేంజ్‌లో నాణ్యత గల వస్త్రాలను కాంపిటేటివ్ ధరల్లో అందిస్తుందని, ఇక్కడ అపరిమితమైన కలెక్షన్స్, అద్భుతమైన మోడల్స్ అందుబాటు ధరల్లో లభిస్తాయన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఎన్నో రకాల ఆఫర్స్ ఇస్తున్నామన్నారు. తుని, పాయకరావుపేట పట్టణానికి చెందిన రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూల్ కూల్

- వేడిని చల్లార్చిన ద్రోణి
- వర్షంతో ఊరట చెందిన నగరం
- ఒక్కసారిగా మారిన వాతావరణం





సాక్షి, విశాఖపట్నం: కొన్నాళ్లుగా వాతావరణం వేడిని వెదజల్లుతోంది. వేసవి ఆరంభంలోనే ఉష్ణతాపం ప్రభావం చూపుతోంది. సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బుధవారం ఆకస్మికంగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. ఉత్తర కోస్తాపై ఆవరించిన ద్రోణి ప్రభావంతో వర్షం కురిసింది. ఉదయమే మొదలైన వాన రాత్రి వరకు ఉమ్మడి విశాఖలో కొన్ని చోట్ల మోస్తరు, అక్కడక్కడా భారీగాను కురిసింది. దీనికి చల్లని గాలులు కూడా తోడై వాతావరణాన్ని కూల్ చేసింది. ఇటీవల కాలంలో కాస్తున్న ఎండలతో వేడి అనుభూతిని పొందుతున్న జనానికి వర్షం పెద్ద ఊరటనిచ్చింది. ఆకాశం నిండా రోజంతా మేఘాలు కమ్ముకుని ఎండకు చోటివ్వలేదు. ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఇటు నగరవాసులు, అటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా వాసులూ ఎంతగానో ఆస్వాదించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికంగా అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం రాజాంలో 5.9 సెం.మీల వర్షపాతం నమోదైంది. గురువారం తేలికపాటి జల్లులకే వాతావరణం పరిమితమవుతుందని, ఆకాశం మేఘావృతమై ఉంటుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ప్రాంతం	వర్షపాతం (సెం.మీల్లో)
పెదగంట్యాడ	3.2
గాజువాక	2.3
అగనంపూడి	2.0
పెందుర్తి	1.3
మహారాణిపేట	1.1
సింహాచలం	1.0